
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 28 అక్టోబరు 2024



ఆ ఊరిలో..

మూడు బొడ్రాయిలు

7

- ఎక్కడా లేని విధంగా ఆదిభట్లలో ఏర్పాటు
- ఎప్పుడు ఎవరు ప్రతిష్ఠించారో తెలియదు
- మూడు నాభి శిలలకు ప్రత్యేక పూజలు
- ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

ఆదిభట్ల.. పరిచయం అక్కర్లేని ఊరు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఈ గ్రామం పేరు నేడు ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తోంది. పేరున్న పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ ఇక్కడే వెలిశాయి. పెట్టుబడులకు గ్యారంటీలా అనేక ప్రత్యేకతలు ఉండడటంతో నేడు అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. వీటితో పాటు మరో ప్రత్యేకత ఉంది. ఎక్కడైనా గ్రామ నడిబొడ్డున నాభి శిల(బొడ్రాయి) ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాన్ని నిర్మాణం చేస్తారు. కాగా, దేశంలోనే ఎక్కడ లేని విధంగా ఈ గ్రామంలో మూడు బొడ్రాయిలున్నాయి. ఎప్పుడు, ఎవరు, ఎందుకు ప్రతిష్ఠించారో తెలియదుగాని ఇప్పటికీ ఆ ఆచారం అలాగే కొనసాగుతోంది. బోనాలు పండుగ సమయంలో మూడు చోట్ల ప్రత్యేక పూజలు జరుగుతుండటం విశేషం.



ప్రహరీ నిర్మాణం ఎప్పుడో?

- ఆమనగల్లులోని కేజీబీవీలో అరకొర వసతులు
- ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్మాణానికీ నోచని వైనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు

8



'టెడెక్స్'తో విద్యార్థులకు ఉపయోగం

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

6



ముగిసిన కలర్ చాంప్ ఆర్ట్ పోటీలు

పాల్గొన్న వివిధ ప్రాంతాల విద్యార్థులు

7




షాద్‌నగర్‌లో ఓ వెంచర్

నత్తనడకన ఎల్ఆర్ఎస్

పూర్తికాని దరఖాస్తుల పరిశీలన

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియ అనుకున్నంత వేగంగా జరగడం లేదు. జిల్లాలో దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. క్షేత్ర స్థాయిలో సిబ్బంది కొరతకు తోడు తరచూ సర్వర్ మొరాయిస్తుండటంతో దరఖాస్తుల పరిశీలనలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. కలెక్టర్ శశాంక ఇప్పటికే రెండు సార్లు అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రక్రియను వేగిరం చేయాలని ఆదేశించినా ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు.

- ఇప్పటి వరకు పరిశీలించినవి ఏడు వేలే..
- పంచాయతీల్లో ముందుకు కదలని ప్రక్రియ
- కేవలం ఆరు దరఖాస్తులే పరిశీలన
- దరఖాస్తుదారుల ఎదురుచూపు



రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్లాట్లదారులకు ప్రయోజనం చేకూర్చాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ జిల్లాలో ఇప్పటివరకు సగం దరఖాస్తుల పరిశీలన కూడా పూర్తికాలేదు. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీ శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను సర్వే కోసం నియమించినా ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో కాస్త పర్వాలేకున్నప్పటికీ పంచాయతీల్లో క్షేత్రస్థాయి పరిశీలన మరీ

మిగతా 8వ పేజీలో...



క్రీడా ప్రాంగణం.. గడ్డి మొక్కలతో దర్శనం

గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. యాచారం మండలం కుర్మిద్దలోని క్రీడాప్రాంగణం నిండా గడ్డి పెరిగి ఆటలు ఆడే వీలు లేకుండా ఉంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మైదానంలో గ్రాసం తొలగించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

యాచారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి)

సమాచారం

ఎంఎస్ఎంఈ రుణాల మంజూరుకు శిక్షణ

ఆమనగల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ రుణాల మంజూరు కోసం కల్వకుర్తి నియోజవకవర్గంలోని యువతీ యువకులకు సోమవారం శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలో గగ్గలపల్లి తేజ కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రతీ మండలం నుంచి సుమారు 100 మంది నిరుద్యోగులకు ఉపాధి పొందేందుకు రుణాల మంజూరు కోసం ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో నేడు



విరాళం అందజేస్తున్న నాలాపురం శ్రీనివాస్ రెడ్డి

చుక్కాపూర్‌లో సదర్ ఉత్సవాలు

తలకొండపల్లి , అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామంలో సోమవారం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణకు ఆమనగల్లు మాజీ మార్కెట్‌చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, ఆయన సోదరుడు, పాండు రంగారెడ్డిలు రూ.25వేలు విరాళం అందజేశారు. శేఖర్, నాయకులు శ్రీశైలం, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక



నూతన కార్యవర్గం

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడిగా చట్లపల్లి మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఎల్బీనగర్‌లో నిర్వహించిన ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరి ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా శ్రీకాంత్, కోశాధికారిగా ఎస్. శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా నజీర్, హరికిరణ్, సురేష్, సళ్ల భూమారెడ్డి, అరుణ జ్యోతి, సంతోష్, నవీన్, వీరలయ్య, ఇందిర, సలహాదారులుగా చంద్రశేఖర్, ఉపేందర్, రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-1 మెయిన్స్

మొయినాబాద్ రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా కేంద్రాల్లో వారం రోజుల నుంచి జరుగుతున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని తహసీల్దార్ గౌతమ్ కుమార్ తెలిపారు. శనివారం జోగిపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో 816 మంది సభ్యులకు గాను 440, కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 1200 మందికి గాను 706, విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో 984 మందికి గాను 580 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు.



పీహెచ్‌డీ అందుకుంటున్న టీచర్ శారద

ఆదిభట్ల హైస్కూల్ టీచర్‌కు పీహెచ్‌డీ

ఓయూ నుంచి అందుకున్న హిందీ పండిట్ శారద

ఆదిభట్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వై.శారద ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ సాధించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ హిందీ విభాగం నుంచి శనివారం ఆమె గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌కు చెందిన వై.శారద ఆదిభట్ల జడ్పీ స్కూల్‌లో హిందీ పండిట్‌గా పనిచేస్తున్నారు. 'హిందూ వశిష్ట్ కే కావ్యే మే సంవేదనా ఔర్ షిల్ప్' అనే అంశంపై ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌జాదవ్ పర్యవేక్షణలో ఆము పరిశోధన చేశారు. ఇందుకు గాను ఆమెకు వర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదిభట్ల హైస్కూల్ టీచర్లు, విద్యార్థులు శారదను అభినందించారు.



మృతి చెందిన గొర్రెల వద్ద దిగాలుగా కూర్చున్న పెంటయ్య

వీధికుక్కల దాడిలో 15గొర్రెలు మృతి

మొయినాబాద్ రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అప్పోజిగూడ గ్రామంలో చోటుచేసుకుంది గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొల్లగూడెం పెంటయ్య తనకున్న గొర్రెలను ఎప్పటిలాగే తన మందలో వదిలి వెళ్లాడు. శనివారం అర్ధరాత్రి గ్రామంలోని వీధి కుక్కలు మందపై దాడిచేయడంతో దాదాపు 15 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెలను సాకి ఉపాధి పొందే తనను ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం అందివ్వాలని పెంటయ్య వేడుకున్నాడు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు డిమాండ్ చేశారు. అజీజ్‌నగర్‌లో ఆదివారం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించగా మొయినాబాద్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.తుకారాం, ప్రధాన కార్యదర్శి వినోద్‌యాదవ్, గౌరవాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కోశాధికారి మహేందర్, ఉపాధ్యక్షురాలిగా లలిత నియమితులయ్యారు. కార్యవర్గానికి కాశీరావు నియామక పత్రాలందజేశారు. ప్రభుత్వం ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. తెలంగాణలోని ప్రభుత్వ టీచర్లంతా కష్టాల్లోనే ఉన్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోసెఫ్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, కృష్ణ, అరుణ్‌కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీదేవి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అజీజ్‌నగర్‌లో మాట్లాడుతున్న కోట్ల కాశీరావు



ఎస్సైకి సమస్యను వివరిస్తున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

చౌడమ్మగుట్టపై బ్లాస్టింగ్‌లు ఆపాలి : పీవీఆర్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్టపై కొనసాగిస్తున్న పేలుళ్లకు ఇళ్లు కంపిస్తున్నాయని శ్రీ బాలాజీ టౌన్‌షిప్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు టౌన్‌షిప్ నివాసి అయిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి నేతృత్వంలో ఆదివారం సాయంత్రం కాలనీవాసులు చౌడమ్మగుట్టపైకి వెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చి, ఆందోళన చేపట్టారు. అక్కడకు వచ్చిన ఎస్సై బాల్‌రాంకు పేలుళ్ల తీవ్రత గురించి వివరించారు. రియల్టర్లు గోరంత అనుమతులు పొంది కొండంత పేల్చివేతలు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రియల్టర్లు పాత జాతీయ రహదారి పక్కన ఉన్న గుట్టను పేల్చి అక్కడున్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నామరూపాలు లేకుండా చేశారన్నారు. ఇప్పుడు చౌడమ్మ దేవాలయం లేకుండా చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఈ మేరకు శంషాబాద్ డీసీపీకి ఫోన్ చేసి సమస్యను వివరించారు. పర్యావరణానికి, ప్రజలకు ఇబ్బంది కల్గించే విధంగా చేపడుతున్న పేలుళ్లపై విచారణ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

నిధులున్నా నిష్ప్రయోజనం

గత ప్రభుత్వ హయాంలో మంజూరు

- అస్తవ్యస్తంగా దారులు
- పూర్తికాని నిర్మాణ పనులు
- అవస్థ పడుతున్న ప్రజలు



కొత్తపల్లి, మాల్ గ్రామాల మధ్య ఆగిపోయిన కల్వర్టు నిర్మాణ పనులు

యాచారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించినా పనులు ముందుకు సాగడం లేదు. యాచారం మండలంలోని కొత్తపల్లి-మాల్, కొత్తపల్లి-నాగిల్ల, నజ్దిక్‌సింగారం- అయ్యవారిగూడ మధ్య ఉన్న రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు అప్పటి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించారు. కొత్తపల్లి నుంచి మాల్ రోడ్డు మరమ్మతుకు రూ.3కోట్ల 50లక్షలు, కొత్తపల్లి నుంచి నాగిల్ల రహదారి పనులకు రూ.3కోట్లు, నజ్దిక్‌సింగారం నుంచి అయ్యవారిగూడ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు మరమ్మతుకు రూ.28లక్షల నిధులు కేటాయించారు. పది రోజుల్లో పనులు పూర్తి చేయాలని అప్పట్లో ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కానీ ఇప్పటివరకు పూర్తికాలేదు. కొత్తపల్లి నుంచి మాల్ గ్రామాల మధ్యన రెండు చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. గోతులు తీసి కంకర వేసి వదిలేశారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో

మిగతా 8వ పేజీలో...

‘టెడెక్స్’తో విద్యార్థులకు ఉపయోగం

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకునేందుకు టెడెక్స్ ఒక మంచి వేదికని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. అజీజ్‌నగర్‌లోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో ‘పవర్ ఆఫ్ పెర్సిస్టెన్స్’ పేరుతో టెడెక్స్ మొదటి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. విభిన్న రంగాల నిపుణులు, ఆవిష్కర్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. ముఖ్య అతిథి లక్ష్మీనారాయణ ప్రసంగించారు. ఇలాంటి చర్చా వేదికలతో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆలోచనల ఎక్స్ఛేంజ్‌తోనే నూతన ఆవిష్కరణలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ‘ది సెంటర్ ఫర్ ఎక్సలెన్స్’ డైరెక్టర్ నిఖిల్‌దేశాయ్, పర్వతారోహకురాలు హస్వీమురికి, మిస్ ఇండియా ఏపీ-2022 లలిత, కాలేజీ ఛైర్మన్, ఎమ్మెల్యే పి.రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబరెడ్డి, డీన్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ వెంకటాచలం, కోఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



టెడెక్స్ సమ్మేళనంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

రోడ్లపై భారీ గుంతలు ..
వాహనదారుల ఇబ్బందులు

- అడుగడుగునా ధ్వంసమైన రోడ్లు
- తరచూ చోటుచేసుకుంటున్న వాహన ప్రమాదాలు
- ప్రజల ఇక్కట్లపై పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు


దుగ్గాపూర్ గేటు సమీపంలో పూర్తిగా ధ్వంసమైన రోడ్డు

పెద్దేముల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో చాలా రోడ్లు గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తాండూరు-హైదరాబాద్ రోడ్డు కందనెల్లి శివారు నుంచి మన్‌సాన్‌పల్లి వరకు పాడైంది. పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. తాండూరు-కోట్‌పల్లి రోడ్డు కూడా గుంతలమయమే. గ్రామీణ రోడ్లపై అడుగడుగునా భారీ గుంతలు, తేలిన కంకరతో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. వాటిపై నడిచే వాహనాలు సైతం పాడవుతున్నాయి. టైర్లు పంక్చరవుతున్నాయి. తాండూరు-హైదరాబాద్ రోడ్డుపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తరచూ తిరుగుతూనే ఉంటారు. వారికి రోడ్ల దుస్థితి కన్పించడం లేదా? అని ప్రజలంటున్నారు. గోతుల రోడ్లపై రాత్రివేళల్లో ప్రయాణం మరింత ఇబ్బందిగా మారిందని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నామని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే రోడ్లను బాగు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


గుంత వద్ద బైక్‌పై నుంచి పడ్డ నర్సమ్మ


సీసీతో గుంతలు పూడ్చుతున్న స్థానికులు

బైక్ నుంచి పడి మహిళకు గాయాలు

మంబాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి నర్సమ్మ తన కుమారుడితో కలిసి బైక్‌పై వెళ్తూ చైతన్యనగర్ గేటు సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనానికి దారివ్వబోయి గుంతలో పడిపోయారు. ఆమె అపస్మారక స్థితికి వెళ్లడంతో వికారాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కుటుంబీకులు రూ.4లక్షల వరకు అప్పు చేసి ఆమెకు చికిత్స చేయిస్తున్నారు.

అధికారుల్లో స్పందన కోసమే..



ఒక పనిచేయాలంటే ఎవరో ఒకరు ముందుకు రావాలంటారు. అందుకోసమే నేను కొంత చేస్తే అధికారులు స్పందించి రోడ్డు బాగుచేస్తారని అనుకున్నా. కందనెల్లి సమీపంలో రోడ్డుపై కొన్ని గుంతల్లో సీసీతో పూడ్చాను. చాలా మంది విద్యార్థులను రోజూ బైక్‌లపై తాండూరు తోలుకెళ్లి తీసుకొస్తుంటాం. బైక్‌పై వెళ్తుంటే గుంతల్లో ఎక్కడ పడిపోతామోనని భయమైతుంది. అధికారులు ఇప్పటికైనా గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలి.

- సర్దార్, వాహనదారుడు, కందనెల్లి

పద్మశాలి సంఘం మండల కమిటీ


పద్మశాలి సంఘం నూతన కమిటీ సభ్యులు

కేశంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట చెందు, ఉపాధ్యక్షులు గంజి సుధాకర్, గంజి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శులు ఉడుత హరికృష్ణ, నారని శ్రీనివాసులు, కోశాధికారిగా రాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గంజి చంద్రయ్య, పాలాది రమేష్, శ్రీకాంత్, బాలకృష్ణ, అంజయ్య, చంద్రశేఖర్, సాయి, వెంకటేష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పడిపోతున్న పత్తి ధర


గోదాన్‌లో నిల్వ చేస్తున్న పత్తి

- దూది రైతుకు దుఃఖమే
- దక్కని మద్దతు ధర
- జాడ లేని సీసీఐ కొనుగోళ్లు

తాండూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెల్ల బంగారం పండిస్తున్న రైతుల ఆశలు అడియాశలవుతున్నాయి. రోజురోజుకూ పత్తి ధర క్షీణిస్తోంది. పంటకు మద్దతు ధర లభించక రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ యేడాది ధర తక్కువుందని రైతులంటున్నారు. కొనుగోళ్ల మొదలు నుంచి పోలిస్తే ఇప్పటి వరకు క్వింటాల్‌పై కనిష్ఠంగా 200 నుంచి గరిష్ఠంగా రూ.400 వరకు ధర తగ్గింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521, తేమ శాతాన్ని పరిగణంలోకి తీసుకుంటూ మిల్లర్లు రేటును నిర్ణయిస్తున్నారు.

ఆంధ్రా నుంచి కూలీల రాక

పత్తి తీతకు కూలీల కొరత ఏర్పడింది. తాండూరు నియోజకవర్గంలోని రైతులు ఆంధ్ర ప్రాంతంలోని మంత్రాలయం, ఆళ్లగడ్డ ప్రాంతాల నుంచి కూలీలను రప్పించి పత్తిని తీయిస్తున్నారు. జీవన్గి, గోనూర్, కందనెల్లి, మంతట్టి తదితర గ్రామాల్లో ఆంధ్రా ప్రాంత కూలీలు పత్తి తీస్తున్నారు.

ఆలస్యమవుతున్న సీసీఐ కొనుగోళ్లు

భారత పత్తి సంస్థ(సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు ఆలస్యమవుతోంది. నవంబరు మొదటి వారంలో ఏర్పాటయ్యే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్రం ఏర్పాటుపై సీసీఐ అధికారులు ఇటీవల తాండూరులో పర్యటించి పరిశీలించారు. ప్రస్తుతం యాలాల మండలం దౌలాపూర్ ఒకటి, అగ్గనూర్ రెండు పత్తి జిమ్మింగ్ మిల్లుల్లో వ్యాపారులు కొంటున్నారు. ఇక్కడ పత్తికి మద్దతు ధర ఇవ్వడం లేదు. సీసీఐ కేంద్రం ఏర్పాటు ఆలస్యంతో పరోక్షంగా వ్యాపారులకు అధికారులు మద్దతిస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి.

తేమ శాతంతో పత్తి ధర నిర్ణయం

తేమ 8 నుంచి 12శాతం ఉన్న పత్తికి రూ.7,521 ధర పెడుతున్నారు. 9శాతం రూ.75 తక్కువ, 10శాతం ఉంటే రూ.150, 11శాతం తేమ ఉంటే రూ.225, 12శాతం ఉంటే రూ.300 తక్కువ చొప్పున లెక్కించి రైతు బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తారు. 12శాతం కంటే ఎక్కువ తేమ ఉన్న పత్తి కొనరు. అమ్మకం సమయంలో రైతులు ఆధార్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఇవ్వాల్సి ఉంటుంది.

రైతుల సౌకర్యార్థం వాట్సాప్ నంబర్

పత్తి పంట అమ్మే రైతుల కోసం ప్రభుత్వం ఒక నంబర్‌ను కేటాయించింది. వాట్సాప్ నంబర్ 8897281111లో వివరాలు నమోదు చేస్తే క్షణాల్లో సమాచారం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. మద్దతు ధర, సమీప జిన్నింగ్ మిల్లుల సమాచారం, ఖాతాలో డబ్బు పడిందా? లేదా వంటి సమాచారాన్ని రైతులు తెలుసుకోవచ్చు.

తేదీ	తేమ శాతం	రేటు(రూపాయలు)
21-10-2024	8శాతం-12శాతం	7,001-7,401
	రెండో రకం	6,401-7,001
22-10-2024	8శాతం-12శాతం	6,951-7,351
	రెండో రకం	6,351-6,951
23-10-2024	8శాతం-12శాతం	6,951-7,351
	రెండో రకం	6,351-6,951
24-10-2024	8 శాతం-12శాతం	6,901-7,301
	రెండో రకం	6,201-6,901
25-10-2024	8శాతం - 12శాతం	6,851-7,251
	రెండో రకం	6,251-6,851
26-10-2024	8శాతం - 12శాతం	6,801-7,201
	రెండో రకం	6,001-6,801

'ఇత్తడి ప్రభ' తయారీకి విరాళం


విరాళాన్ని అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద లోని ఆంజనేయస్వామికి ఆలయానికి ఇత్తడి ప్రభ తయారీకి బీజేపీ నాయకుడు, న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.35వేలు అందజేశారు. ఆలయ నిర్మాణ బాధ్యతలు చేపడుతున్న వెంకటేష్ గుప్తా, వెంకటయ్యలకు ఆదివారం ఆయన డబ్బు ఇచ్చారు. మహేందర్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. నర్సింహ పాల్గొన్నారు.

ముగిసిన కలర్ చాంప్ ఆర్ట్ పోటీలు


మాట్లాడుతున్న అమిత్ కృష్ణ

శంషాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని ఎస్సార్ క్లాసిక్ కన్వెన్షన్‌లో ఒక రోజుపాటు నిర్వహించిన కలర్ చాంప్ 24వ ఆర్ట్ పోటీలు ఆదివారం ముగిశాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉదయం పోటీలను పారిశ్రామిక డిజైనర్ వ్యవస్థాపకుడు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ), ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(ఐఎస్‌పీపీ) ఢిల్లీ విజిటింగ్ ఫ్యాకల్టీ అమిత్‌కృష్ణ గులాటీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళల్లో తప్పు లేదా ఒప్పు అనేది ఉండదన్నారు. కళ ఎల్లప్పుడు సరైందేనన్నారు. కళ ఒక నైపుణ్యమని, ఇది ప్రజలను సంతోష పరుస్తుందన్నారు. సాయంత్రం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడిగా పాండు

కందుకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్నారానికి చెందిన పిట్టల పాండు ముదిరాజ్‌ను సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు బి.అంజయ్య తెలిపారు. ఆదివారం కందుకూరులోని సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానంతరం అంజయ్య మాట్లాడారు. పాండును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని, త్వరలో పూర్తిసాయి కమిటీని ఎన్నుకుంటామన్నారు. సంఘం మాజీ అధ్యక్షులు బాబురావు, రాములు, కాకి దశరథ్, జయేందర్, లింగం, డి.శ్రీధర్, యాదయ్య, నాయకులు ఇ.శ్రీనివాస్, బాల్‌రాజ్, ఉదయ్‌కిరణ్, కె.సురేందర్, గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు


గ్యార్మీ జెండాతో ముస్లింలు

ఆమనగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని పీర్ల మసీద్ కాలనీ మహబూబ్ సుభాని దర్గా వద్ద గ్యార్మీ షరీఫ్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంజుమనే గులామే ముస్తాఫా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముస్లింలు, యువకులు పాల్గొన్నారు. దర్గా నుంచి గ్యార్మీ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం దర్గాలో జెండాను ప్రతిష్ఠించారు. ఆఫీజ్ మౌలానా వాహెద్ ఆధ్వర్యంలో ప్రార్థనలు, దువ్వా చేపట్టారు. ప్రజలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జామామసీద్ అధ్యక్షుడు మాసూమ్, నాయకులు రజాక్, ఖాదర్, అజీమ్, ఖలీం, ఇమ్రాన్, కమిటీ సభ్యులు అక్రం, అక్బర్, బాబ, అజహర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహా భాగ్యమని, మనిషి ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయగలడని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. ఓమ్లానాయక్‌తండాలో సుమిత్ర రాథోడ్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేకు వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తండాలో సుమిత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించడం హర్షణీయం అన్నారు. ఎంతో మందికి అనారోగ్యంగా ఉన్నా ఖర్చులకు భయపడి వైద్యపరీక్షలు చేయించుకోవడం లేదన్నారు. అలాంటి వారికి ఇలాంటి శిబిరాలు ఉపయోగకరం అన్నారు. సుమిత్ర, వైద్య పరీక్షలు చేసిన విరించి ఆస్పత్రి సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జి.నారాయణరెడ్డి, శోభారాణి, మహిపాల్‌రెడ్డి, యు.మల్లేశం, జితేందర్‌రెడ్డి, డీవై.నర్సిములు, కోహీర్ రవిశంకర్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు, వ్యాపారవేత్త కె.రవిశంకర్ తండ్రి బిచ్చన్నకు ఇటీవల గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేయించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన ఆయనను ఎమ్మెల్యే పెద్దేముల్‌లోని ఇంటికి వెళ్లి బిచ్చన్నను పరామర్శించారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



వికారాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికులందరికీ 50రకాల వైద్యపరీక్షలు ప్రభుత్వం ఉచితంగా చేస్తోందని హెల్త్ క్యాంప్ కో-ఆర్డినేటర్ విష్ణువర్ధన్ తెలిపారు. ఆదివారం వికారాబాద్‌లోని గ్రంథాలయం ఆవరణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని లేబర్ కార్డున్న కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఈ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆ ఊరిలో.. మూడు బొడ్రాయిలు




కింది బస్తీలోని బొడ్రాయి, ఎస్‌బీఐ బ్యాంకు ముందు, మునిపల్ ఆఫీస్ సమీపంలో..

- ఎక్కడా లేని విధంగా ఆదిభట్లలో ఏర్పాటు
- ఎప్పుడు ఎవరు ప్రతిష్ఠించారో తెలియదు
- మూడు నాభి శిలలకు ప్రత్యేక పూజలు
- ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

ఆదిభట్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల గ్రామం అన్నింటికీ ప్రత్యేకమే.. ఇక్కడా పెద్దపెద్ద మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ ఇక్కడే వెలిశాయి. దేశం నలుమూలల నుంచి వేల సంఖ్యలో ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. దీనికితోడు ఈ గ్రామం దేశంలో ఎక్కడా లేని విధంగా మూడు బొడ్రాయిలు దర్శనమిస్తాయి. ఇలా ఎందుకు ఏర్పాటు చేశారో ఎవరికీ అంతుచిక్కని రహస్యం ఇది. ఆదిభట్లలోని కింది బస్తీలో ఒకటి మధ్యలో ఎస్‌బీఐ ఎదుట మరోటి, మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ఒకటి మొత్తం మూడు చోట్ల బొడ్రాయిలున్నాయి. వందల ఏళ్ల కిందట గ్రామాన్ని నిర్మించిన రోజు ఏర్పాటు చేసిన బొడ్రాయి గ్రామంలో సీసీ రోడ్ల ఏర్పాటుతో భూమికి సమానంగా మారుతున్నాయి. అనేక గ్రామాలలో బొడ్రాయిని తొలగించి పూజలు నిర్వహించి కొత్త నాభిశిల ఏర్పాటు చేస్తుండటం తరుచూ చూస్తున్నాం. ఆదిభట్లలో ఉన్న ఈ మూడు నాభిశిలలు భూమి లేవల్‌కు చేరుకున్నాయి. ఇక్కడ కూడ కొత్తది ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు వచ్చినా పైకి లేపాలంటే ముందు ఏది కదిలించాలి అనే మీమాంసతో ఎవరూ ముందుకు రావడం లేదు. ఏ ఉద్దేశంతో ఏర్పాటు చేశారు? అనవసరంగా కదిలిస్తే ఏలాంటి సమస్యలు వస్తాయో? అని వాటి జోలికి పోవడం లేదు. ఏదేమైనా గతంలో డంపింగ్ యార్డు కోసం గుర్తించిన ఓ శివారు కుగ్రామం నేడు జాతీయ అంతర్జాతీయ గుర్తింపునకు నోచుకోని ప్రపంచపటంలో చోటు దక్కిందంటే ఆ బొడ్రాయి నాటిన వేళావిశేషం కూడా కావచ్చని గ్రామస్తులు చెప్పుకోవడం గమనార్హం.

ఎప్పుడు పెట్టిండ్రో తెలవదు



మా ఊరిలో మూడు బొడ్రాయిలు ఉన్న విషయం నేను చిన్నతనం నుంచి చూస్తున్నా. మాతాతల కాలం నుంచే ఉన్నాయి. ఎక్కడ కూడా ఇలా మూడు బొడ్రాయిలు ఉండవు. ఎప్పుడు పెట్టిండ్రో, ఎందుకు పెట్టిండ్రో తెల్వదు. ఏ ఊరిలో మూడు బొడ్రాయిలు చూడలే ఇక్కడనే ఈ సిత్రం ఉందంటూ ఊరికి వచ్చిన చుట్టాలు మాట్లాడుతరు.

- కోరే జంగయ్య, ఆదిభట్ల

ఈ బొడ్రాయిలతో మంచే జరిగింది



దేశంలోనే ఎక్కడ లేని విదంగా మా ఊరిలో మూడు చోట్ల బొడ్రాయిలు ఉండటం మా అదృష్టంగా చెప్పుకుంటాం. గ్రామానికి గుర్తింపు రావడానికి నాభిశిల పాతిన వేళావిశేషంగా మాపెద్దలు చెబుతుంటారు. ఏ ఆచారం ప్రకారం ఏర్పాటు చేశారో తెలియదు గాని వాటి వల్ల మంచి జరిగిందని చెప్పొచ్చు. కనీస ఉపాధి అవకాశాలు లేని స్థాయి నుంచి వేల మందికి ఉపాధి ఇచ్చే స్థాయికి ఆదిభట్ల చేరుకుంది.

- మర్రి నిరంజన్ రెడ్డి, చైర్మన్ ఆదిభట్ల మున్సిపాలిటీ

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బషీరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ జడ్పీ పాఠశాలలో 2007-08 బ్యాచ్ పదో తగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 18ఏళ్ల తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కొర్విచెడ్ వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో కలిసి పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. నాటి ఉపాధ్యాయులు మాధురి, పురుషోత్తం, ఆనంద్, వెంకటస్వామి, సురేష్, రాములు, సతీష్, జగదేవి, నాగరాజు, భాగ్యలక్ష్మి, పాషా, పూర్వ విద్యార్థులు సతీష్, శాంత్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, ముక్తార్, అరవింద్, వికాస్, రవీందర్, మోహన్, రమేష్, రవికుమార్, అంజి, యాదయ్య, జగ్గయ్య, నరేందర్, సకారాం, కుమార్, బషీర్ పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా


తండా వాసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్/కొడంగల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. దుద్యాల మండలం రోటిబండ తండాలో ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టిన సంఘటనలో గాయాలైన తండావాసులను ఆదివారం పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి పథకాలు ఇవ్వకున్నా పర్వా లేదుగానీ పేదల భూముల జోలికి రావొద్దన్నారు. భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. అలాగే నరేందర్‌రెడ్డి పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. మద్దూర్ మండలంలో మాజీ ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి మనుమరాలి ఊయల వేడుకకు, కొడంగల్ మండలం ధర్మాపూర్‌లో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీ.. రైతుకు ఉపకారి!

- తక్కువ సమయంలో పొలాల్లో పురుగుల మందు స్ప్రే
- రూ.500 ఖర్చుతో ఐదు నిమిషాల్లోనే ఎకరం మేర పిచికారీ
- రైతులకు సమయం, పెట్టుబడి ఖర్చు ఆదా!

బషీరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. తక్కువ శ్రమ, తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో పని పూర్తిచేసేందుకు ఉన్న అవకాశాలపై వెతుకున్నారు. పంటలపై పురుగుల మందు పిచికారీ రైతులకు సవాల్‌గా మారింది. కూలీలు దొరకక, సకాలంలో పురుగుల మందును పంటలపై పిచికారీ చేయలేపోతున్నారు. రైతులు డ్రోన్ స్ప్రేయర్లతో పిచికారీ, చేయిస్తూ కొంత వెసులుబాటు పొందుతున్నారు.

ఐదు నిమిషాల్లో ఎకరం పంటపై పిచికారీ..!

ఏ పంటకైనా ఇద్దరు వ్యక్తులు రోజంతా స్ప్రే చేస్తే మూడు, నాలుగు ఎకరాలకు మించి మందు కొట్టలేరు. అదే డ్రోన్‌తో రోజూ వంద ఎకరాల్లో పిచికారీ చేయొచ్చు. డ్రోన్‌తో ఐదు నిమిషాల్లో ఎకరం పొలాన్ని ఒకే వ్యక్తి పిచికారీ చేసుకోవచ్చు. గడ్డిమందు, పంటలపై మందుల పిచికారీకి రైతులు డ్రోన్‌ల వినియోగంపై ఇప్పుడిప్పుడే దృష్టిపెడుతున్నారు. దీంతో రైతులకు కూలీల ఖర్చు తగ్గి సమయం కూడా ఆదా అవుతుంది. అదీగాక మనిషితో పోలిస్తే డ్రోన్‌తో పిచికారీ చేస్తే మొక్క మొత్తం వేళ్ల వరకు తడిసి పురుగు చనిపోయే ఆస్కారం ఉంది. అలాగే డ్రోన్ ఫ్యాన్ గాలి ధాటికి పైరుపై ఉండే పురుగులు సైతం పడిపోయే అవకాశం ఉంది. రైతు పొలంలో అడుగుపెట్టకుండానే గాలిలోనే డ్రోన్‌తో మందు పిచికారీ చేసే అవకాశం ఉంది. రసాయన మందు, అవసరమున్న మేరకు నీటిని సిద్ధంగా ఉంచితే మిగతా పని డ్రోన్ ఆపరేటర్ చూసుకుంటాడు. మంతట్టి, రెడ్డిఘణాపూర్, కాశీంపూర్, గొట్టిగఖుర్దు గ్రామాల రైతులు డ్రోన్‌తో పత్తి, కంది, వరి పంటలపై పిచికారీకి మొగ్గు చూపుతున్నారు. 12నుంచి 15లీటర్ల ట్యాంక్ కెపాసిటీ ఉన్న డ్రోన్ ధర రూ.7.6లక్షలు ఉంది. కొందరు పెద్ద రైతులు డ్రోన్లు కొని తమ పొలాల్లో పిచికారీ చేసుకుంటూ తోటి రైతుల పొలాల్లో పిచికారీ చేస్తూ ఉపాధి పొందుతున్నారు. డ్రోన్‌తో ఎకరం పిచికారికి రూ.500 తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. డ్రోన్‌తో పైమందు పిచికారీకి సమయం ఎంతో ఆదా అవుతుంది. 25 నుంచి 30 నిమిషాల్లో 5ఎకరాల్లో పిచికారీ చేయొచ్చు. డ్రోన్ ఎలక్ట్రిక్ చార్జింగ్‌తో పనిచేస్తుంది. దీంతో పెట్రోల్, డీజిల్ ఖర్చు కూడా ఉండదు. రసాయనం కలిపిన 12 లీటర్ల నీటితోనే ఎకరం పంటపై పిచికారీ చేయడం డ్రోన్ల మరో ప్రత్యేకత!



రెడ్డి ఘణాపూర్‌లో వరిపై పిచికారీ చేస్తున్న డ్రోన్, ఒడ్డున ఉండి డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న యువకుడు

సబ్సిడీపై డ్రోన్‌లు ఇస్తే రైతులకు మేలు



డ్రోన్ల రాకతో కూలీల ఇబ్బంది తప్పింది. కూలీలు దొరకక సకాలంలో మందు పిచికారీ చేయకుంటే పంటలకు ఎక్కువ నష్టం కలుగుతుంది. డ్రోన్‌తో త్వరగా ఎప్పుడంటే అప్పుడు పిచికారీ చేస్కోవచ్చు. దీంతో డబ్బు, సమయం, ఆదా అవుతుంది. రైతులకు శ్రమ కూడా తక్కువే. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై డ్రోన్‌లు ఇస్తే బాగుంటుంది. దీంతో సన్నచిన్నకారు రైతులు అదనంగా ఉపాధి పొందుతారు.

- ఎండీ యాసిన్, రైతు, రెడ్డిఘణాపూర్



మల్లును సన్మానిస్తున్న నర్సింహ, శ్రీనివాస్

ఎంపీ మల్లు రవికి సన్మానం

ఆమనగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడిగా నియమితులైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని ఆదివారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణతో కలిసి మల్లు రవిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి యువత ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేయాలని మల్లును కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ప్రహరీ నిర్మాణం ఎప్పుడో?

- ఆమనగల్లులోని కేజీబీవీలో అరకొర వసతులు
- ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్మాణానికీ నోచని వైనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- విశాల స్థలం ఉన్నా.. క్రీడలు ఆడటమూ కష్టమే!

ఆమనగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి ప్రహరీ లేక విద్యార్థినులు, ఉపాధ్యాయినీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ నిర్మాణం విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. ఏళ్లకాలంగా విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వం, పాలక ప్రజాప్రతినిధులను కోరుతూ వస్తున్నా స్పందన లేదు. 2006లో ఆమనగల్లు పట్టణానికి కేజీబీవీ మంజూరైంది. 2010లో స్థానిక షిరిడీ సాయిబాబా దేవాలయం వద్ద నూతన భవనం నిర్మించారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 6 నుంచి 10 తరగతుల్లో 228 మంది విద్యనభ్యసిస్తున్నారు. పట్టణానికి చివరగా హైదరాబాద్ రోడ్డును అనుసరించి ఉన్న కేజీబీవీకి ప్రహరీ నిర్మాణం గురించి విద్యార్థి సంఘాల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు మంత్రులు, ఉన్నతాధికారులకు విన్నవించినా నేటికీ నిధులు మంజూరు కావడం లేదు. దాంతో ప్రహరీ లేక పాఠశాల ఎదుట ఖాళీ స్థలంలో మూగజీవాలు సంచరిస్తున్నాయి. హరితహారంలో నాటిన



ఆమనగల్లులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం

మొక్కలకు కూడా రక్షణ లేకుండాపోతోంది. విద్యార్థినులు బయట ఆడుకోవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. ప్రహరీ నిర్మించి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని విద్యార్థినీలు, స్థానికులు 14 ఏళ్లుగా కోరుతున్నారు. అదేవిధంగా పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌కూడా లేదు. గతంలో ప్లాంట్ మంజూరైనా నీటివసతి లేక దాన్ని ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ఏళ్లకాలంగా వినియోగించక మంజూరైన వాటర్ ప్లాంట్ కూడా నిరుపయోగంగా మారింది. దాంతో మినరల్ వాటర్ కొని విద్యార్థినులకు అందజేస్తున్నారు. పాఠశాల ముందు, వెనుక భాగంలో విశాలమైన స్థలం ఉన్నా ఆట స్థలానికి అనుకూలంగా మలచకపోవడంతో ప్రయోజనం లేకుండాపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొంటున్నా అందుకనుగుణంగా చర్యలు చేపట్టడం లేదనడానికి ఆమనగల్లు కేజీబీవీ నిదర్శనంగా నిలిచింది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని ప్రహరీ నిర్మాణం, ఇతర సమస్యలు పరిష్కరించాలని స్థానికులు, విద్యార్థినులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం



ఆమనగల్లు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రధానంగా పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకుపోగా సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా ప్రహరీ నిర్మించేలా చూస్తాం.

– పద్మజ్యోతి, ఎస్వో, కేజీబీవీ–ఆమనగల్లు

క్రైం కార్నర్

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

కేశంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం మోటర్ సైకిల్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. బొదునంపల్లి గ్రామానికి చెందిన బండ రాంరెడ్డి(65) పని నిమిత్తం కేశంపేటకు వచ్చాడు. గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా కొత్తపేటకు చెందిన యువకులు బైక్‌పై వేగంగా వచ్చి రాంరెడ్డిని ఢీకొట్టారు. దాంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. యువకులు మద్యంతాగి బైక్ వేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా, మృతుడు రాంరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కళాశాల భవన నిర్మాణానికి శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో నిర్మించతలపెట్టిన షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనులను ఆదివారం మొదలుపెట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జేసీబీకి కొబ్బరికాయ కొట్టి, పిల్లర్ గోతులను తీయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అన్ని హంగులతో నూతన భవనాన్ని నిర్మించాలని ఇటీవల ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో భూమి పూజ చేసిన విషయం విధితమే. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్‌తో పాటు బీజేపీ, వామపక్ష, ఎంఐఎం పార్టీల నాయకులు హాజరైన సభలో దాతలు విరాళాలు ప్రకటించారు. దాతల సహకారంతో మోడల్‌గా భవనాన్ని నిర్మించాలని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యే శంకర్ యుద్ధప్రాతిపదికన భవనాన్ని నిర్మించాలని చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, జి. బాల్‌రాజ్‌గౌడ్, సర్వర్ పాష, రఘు, కృష్ణారెడ్డి, ఇద్రీస్, అగ్గనూరి బస్వం, కొమ్ము కృష్ణ, ఇబ్రహీం, రవికుమార్, ముబారక్, అశోక్, ఖదీర్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

ఆమనగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల రైతులు పత్తి పంటను సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆయన సూచించారు. ఆమనగల్లు మార్కెట్‌యార్డ్‌లో ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆమనగల్లు మార్కెట్ పరిధిలో మూడు పత్తి మిల్లులను సీసీఐ కొనుగోలు కేంద్రాలుగా ప్రభుత్వం నోటిపై చేసిందన్నారు. నవంబరు మొదటి వారంలో ఆకుతోటపల్లి, పోలెపల్లి గేటు, తలకొండపల్లి పత్తి మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పత్తికి క్వింటాల్‌కు రూ.7,521 ప్రభుత్వం ధర ప్రకటించిందని, 8 శాతం తేమ ఉన్నప్పుడే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని, తేమ శాతం పెరిగినచో మద్దతు ధర తగ్గుతుందన్నారు. 9 శాతంనకు రూ.7,445.79, పది శాతానికి రూ.7,370.58, 11 శాతానికి రూ.7,295.37, 12 శాతానికి రూ.7,220.16 చెల్లిస్తారని శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. పత్తిలో తేమ శాతం 12కంటే ఎక్కువ ఉన్నట్లైతే సీసీఐ కొనుగోలు చేయదని తెలిపారు. రైతులు తమ పత్తిని తేమ శాతం తక్కువగా ఉండేలా ఆరబెట్టి, చెత్తాచెదారం లేకుండా శుద్ధి చేసి సమీపంలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు.

దశలవారీగా గ్రామాల అభివృద్ధి



ఎల్ఈడీ లైట్లతో మాజీ సర్పంచ్ పద్మశ్రీధర్ తదితరులు

మంచాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో దశలవారీగా గ్రామాల అభ్యున్నతి కొనసాగుతుందని ఎల్లమ్మతండా మాజీ సర్పంచ్ సపావట్ పద్మశ్రీధర్ అన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులతో మంజూరైన 28 ఎల్ఈడీ లైట్లను ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎల్ఈడీ దీపాల మంజూరుకు సహకరించిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలకు పద్మశ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండెమోని మల్లేష్, బాలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మాలలు సంఘటితం కావాలి



ఆమనగల్లు : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



షాద్‌నగర్ అర్బన్ : నాగర్‌కర్నూల్ సభకు వెళ్తున్న మాల మహానాడు నాయకులు

షాబాద్/ఆమనగల్లు/కందుకూరు/షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మాలలు సంఘటితమై హక్కులను సాధించుకుందామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట అంజనేయులు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభకు షాబాద్ నుంచి నాయకులు బయలుదేరి వెళ్లారు. నాయకులు అశోక్, బాల్‌రాజ్, చంద్రశేఖర్, వేణుగోపాల్, మల్లేష్, కృష్ణ, ప్రవీణ్, రాఘవేంద్ర, మహేష్, శేఖర్ తదితరులు ఉన్నారు. కాగా, ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో ఆదివారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు



షాబాద్ : ఆత్మగౌరవ సభకు తరలి వెళుతున్న నాయకులు

వేసి నివాళులర్పించారు. అనంతరం వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ నిరసన ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఇచ్చిన తీర్పు సరికాదన్నారు. తీర్పును రద్దుచేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని నాయకులు అన్నారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం మాల కులస్తులంతా సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేవలం మాలలను ఓటు బ్యాంకుగా చూసే పార్టీలకు బుద్ధి చెప్పక తప్పదన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మాలల ఆత్మగౌరవ సభకు మాలల మహానాడు నాయకులు తరలివెళ్లారు. మాల మహానాడు జిల్లా మండల నాయకులు కాలె మల్లయ్య, లండం చంద్రయ్య, గోరటి నర్సింహ, చెట్టిమల్ల చెన్నకేశవులు, కాలె మల్లేశ్, సురిగిమల్ల శేఖర్, కోరే రవి, మల్లేశ్, పరమేశ్, భరత్, లండం మల్లేశ్, సురేశ్, ప్రశాంత్, చెన్నకేశవులు, రాఘవేందర్, శివ, తదితరులు ఉన్నారు. మాలల ఆత్మగౌరవ సభకు కందుకూరు మండలం నుంచి ఆ సంఘం నేతలు తరలి వెళ్లారు. మండల నాయకుడు గాదె కుమార్ ఆధ్వర్యంలో ఉదయం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం వాహనాల్లో తరలివెళ్లారు. పి.శేఖర్, గాదె యాదగిరి, బి.రాజు, కె.పాండు, సురేష్ తదితరులు తరలి వెళ్లారు. కాగా, ఓటు బ్యాంకును పెంచుకోవడానికి ఎస్సీ కులాల మధ్య చిచ్చు పెట్టొద్దని మాల మహానాడు నాయకులు ప్రభుత్వాలను కోరారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆదివారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన మాలల ఆత్మీయ సభకు షాద్‌నగర్ నియోజక వర్గం నుంచి అధిక సంఖ్యలో మాల మహానాడు నాయకులు తరలివెళ్లారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, తరలివెళ్లారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు వేణుగోపాల్, జనార్ధన్, రామకృష్ణ, బుచ్చయ్య, బీష్వ రామకృష్ణ, అర్జున్‌కుమార్, నర్సింహులు, మహేందర్, రాంచందర్, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మినీ కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు నిధులివ్వాలి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరుట్లలో మినీ కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంచాల మండల కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఆరుట్ల సహకార బ్యాంకు ఆవరణలో కూరగాయల ఏర్పాటుకు అనువైన స్థలం గుర్తించామని చెప్పారు. ఈ సందర్భంగా బుగ్గజాతర ఏర్పాట్లపై చర్చించారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మడలాధ్యక్షుడు రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్‌కు సన్మానం

కడ్తాల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ చారగొండ వెంకటేష్‌ను ఆదివారం యూత్ కాంగ్రెస్ కడ్తాల మండలాధ్యక్షుడు హీరాసింగ్, గిరిజన నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి , ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని వెంకటేశ్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నాయకులు కిషన్, తులసీరామ్ నాయక్, రమేశ్‌నాయక్, నర్సింహగౌడ్, తదితరులు ఉన్నారు.

దాసర్లపల్లి దుర్గామాత మండపం నూతన కమిటీ

కందుకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసర్లపల్లి గ్రామ దుర్గామాత మండపం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చైర్మన్ జంబుల శివరాంరెడ్డి తెలిపారు. ఆదివారం పంచముఖ హనుమాన్, రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశం అనంతరం మాట్లాడారు. ఉపాధ్యక్షుడిగా మీగడి నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా కందూరి యుగేందర్‌గౌడ్, కోశాధికారిగా మహేష్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు.దయాకర్, పి.అశోక్, తదితరులున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కడ్తాల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోయిన్‌గుట్ట తండా నుంచి ముద్విన్ గ్రామం వరకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక నాయకులు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డిచే శంకుస్థాపనకు ఏర్పాటు చేసినా.. ఆయన రాకపోవడంతో స్థానిక నాయకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పాలకుర్ల రాములు తెలిపారు. రోడ్డు నిర్మాణం పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌని లక్ష్మయ్యగౌడ్, భీష్మాచారి, మహేందర్, సత్యం, హరిచంద్ర, యాదయ్య, మోతి, అంజి , గోపి, లోకేశ్ , తదితరులు పాల్గొన్నారు.

పాషా, నరహరిల ఆశయాలను నెరవేర్చాలి



మంచాల : జాపాలలో పాషా, నరహరి వర్ధంతిలో పాల్గొన్న సీపీఎం నాయకులు

యాచారం/మంచాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పేదల కష్టాలను తీర్చడం కోసం పోరాటాలు చేసిన పాషా, నరహరిల ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సీపీఎం నాయకులు పాల్ పిలుపునిచ్చారు. యాచారం మండలం కుర్మిద్దలో శనివారం రాత్రి పాషా, నరహరిల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. నానక్‌నగర్, చిన్నతూండ్ల, ధర్మన్నగూడ, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో పాషా, నరహరిల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ బాషయ్య, సీపీఎం నాయకులు పి.అంజయ్య, ఎం.శ్రీమన్నారాయణ తదితరులున్నారు. నిరుపేదల అభ్యున్నతికోసం పాటుపడిన అమరవీరుల ఆశయసాధనకు కృషి చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.యాదయ్య అన్నారు. పాషా, నరహరిల వర్ధంతిని మంచాల మండల పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. మంచాల, జాపాల, లోయపల్లి, చిత్తాపూర్, ఆరుట్ల, చెన్నారెడ్డిగూడ, తిప్పాయిగూడ తదితర గ్రామాల్లో శనివారం రాత్రి సీపీఎం నేతలు పాషా, నరహరిల చిత్రపటాలకు నివాళులర్పించారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు శ్యాంసుందర్, ఎస్.రాజు, కె.శ్రీనివాస్‌రెడ్డి, రావుల జంగయ్య, ఆవుల యాదయ్య, గోరెంకల నర్సింహ, గోపాల్, బుగ్గరాములు, పాండు, కె.పాపిరెడ్డి, ఓరుగంటి భాస్కర్, జలందర్, మంతని జంగయ్య, రజాక్‌పాషా, ప్రభాకర్, పరమేష్, నర్సింహ, రవూఫ్, సత్యం, ఎల్.నర్సింహారెడ్డి, ఐలయ్య, ఎల్.నర్సింహారెడ్డి, వెంకటేష్, జంగయ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఎల్ఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

అధ్వానంగా ఉంది. ఇలాగే ఉంటే నిర్ణీత గడువులో లక్ష్యాన్ని చేరుకోవడం కష్టంగా కనిపిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్, పంచాయతీల్లో 2,83,689 దరఖాస్తులు వచ్చాయి. అందులో మున్సిపాలిటీల్లో అత్యధికంగా 2,37,259 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 7,023 మాత్రమే పరిశీలించారు. అలాగే పంచాయతీల్లో 46,430 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కేవలం ఆరింటిని మాత్రమే పరిశీలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అధికారులు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల్లో పర్యటిస్తున్నారు. మొదటి దశలో క్షేత్రస్థాయిలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన మొబైల్ యాప్ ద్వారా పరిశీలన కొనసాగుతోంది. సర్వే నెంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం లేదా మున్సిపాలిటీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన బృందం దరఖాస్తులను పరిశీలిస్తోంది. ఈ బృందం జీపీఎస్ ద్వారా సదరు భూమి హద్దులు, ఇతర సమాచారాన్ని మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తోంది. అదే సమయంలో ఈ భూములు బఫర్ జోన్, నాలా, చెరువులు, గవర్నమెంట్ ల్యాండ్ పరిధిలోనివి కావని ఈ బృందం ధ్రువీకరిస్తుంది.

ఇప్పటికే ఆధారాలు కలిగిన దరఖాస్తులకు చెందిన ప్లాట్లను స్థానిక అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రికార్డుల్లో ఉన్న వివరాలతో క్షేత్ర స్థాయిలో పోల్చిచూసిన తర్వాత తాజా పరిస్థితులపై నివేదిక ఇస్తారు. ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. కానీ.. ప్రభుత్వం నిర్దేశించిన గడువులో పరిశీలన పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేవు. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన వాటిలో ఒక్కశాతం ర్యాండమ్ చెకప్ చేస్తారు. సరైనవని తేల్చినపుడు అర్జీలకు సంబంధించిన వివరాలను మున్సిపాలిటీలు, పంచాయతీలకు పంపుతారు. అన్నివిధాలా అర్హత కలిగి ఉన్నట్లు అధికారులు గుర్తించిన తర్వాతే ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేస్తారు.

ఇంకెప్పుడు పరిశీలిస్తారు



రెండు ప్లాట్లకు వేయి రూపాయల చొప్పున డబ్బులు చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటి వరకు ఏ అధికారి కూడా పరిశీలనకు రాలేదు. అధికారులు స్పందించి త్వరగా దరఖాస్తులను పరిశీలించి ప్లాట్లను క్రమబద్ధీకరించాలి.

- బొక్క నవనీత,
కొత్తగూడ, కందుకూరు మండలం

నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న



తెలంగాణ ప్రభుత్వం 2020 ఆగస్టు నెలలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. నా ప్లాట్‌కు ఎల్ఆర్ఎస్ అనుమతి కోసం వెయ్యి రూపాయలు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాను. నాలుగేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి శుభవార్త చెప్పింది. ఎల్ఆర్ఎస్ అమలు చేసేందుకు దరఖాస్తుల పరిశీలన చేస్తున్నామన్నారు. కానీ.. ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి రాలేదు.

- మారం చంద్రశేఖర్, షాద్‌నగర్

యాచారం చేరిన సీతారామ చంద్రస్వాముల విగ్రహాలు

యాచారం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : యాచారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలో ప్రతిష్ఠించడానికి రాజమండ్రి నుంచి ఆదివారం శ్రీ సీతారామచంద్రస్వామి, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహాలను తీసుకొచ్చారు. ఈమేరకు విగ్రహాలను గ్రామంలోని వాడవాడల్లో ఊరేగించిన అనంతరం ఆలయంలో ఉంచారు. త్వరలో విగ్రహాలను ప్రతిష్ఠించడానికి తగిన ఏర్పాట్లు చేస్తు న్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రూ.60 లక్షలతో మురుగు కాల్వ నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ లక్ష్మణ్

ఆమనగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు ఉదయ్‌నగర్ కాలనీలో అంతర్గత మురుగుకాల్వ నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కాలనీలో అంతర్గత మురుగు కాల్వలేక కాలనీ నివాసస్థులు ఏళ్లకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ చొరవతో మురుగు కాల్వ నిర్మాణానికి టీయుఎఫ్ఐడీసీ నిధుల ద్వారా రూ.60 లక్షలు కేటాయించారు. ఇటీవల పనులను ప్రారంభించగా ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఆదివారం పనులను లక్ష్మణ్ పరిశీలించారు. పనులు నాణ్యతగా, వేగవంతంగా చేపట్టాలని సూచించారు.

మినీ ఫంక్షన్‌హాల్‌ను వినియోగించుకోవాలి



ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవంలో రత్నం, మాజీ ఎంపీపీ విజయలక్ష్మిరమణారెడ్డి తదితరులు

చేవెళ్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు జరుపుకునే అన్ని రకాల శుభకార్యాలకు నూతన మినీ ఫంక్షన్‌హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని, దానిని ప్రజలు వినియోగించుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని రామన్నగూడ గ్రామంలో మాజీ ఎంపీపీ మల్గారి విజయలక్ష్మిరమణారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో మల్గారి లక్ష్మి భాగ్యమ్మ మల్లారెడ్డి జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించిన మినీ ఫంక్షన్‌హాల్‌ను వారి కుటుంబ సభ్యులు వేదపండితులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. రమణారెడ్డి బ్రదర్స్‌ను అభినందిస్తున్నట్లు రత్నం తెలిపారు. అంతకుముందు విజయలక్ష్మిరమణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సొంత డబ్బుతో అన్ని వసతులతో మినీ ఫంక్షన్‌హాల్‌ను నిర్మించినట్లు చెప్పారు. మాజీ ఎంపీపీ మల్గారి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జంగం శివనాందం, బీఆర్ఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా బీజేపీ యువ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి, న్యాయవాది మల్గారి దినేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు వెంకటేశం, ఎల్లయ్య, మాజీ సర్పంచ్‌లు ఎన్ను జంగారెడ్డి, సామ మాణిక్యరెడ్డి, సీనియర్ నాయకులు అంజనేయులుగౌడ్, పెద్దోళ్ల దాయకర్, దేవుని శర్వలింగం, సుదర్శన్, శివకుమార్, ప్రభాకర్, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు ఉన్నారు.

ముమ్మరంగా ఆలయ నిర్మాణ పనులు



పనులను పరిశీలిస్తున్న గ్రామ నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండలం నల్లవారిపల్లిలో హనుమాన్ దేవాలయ నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పాత ఆలయం స్థానంలో దాతల సహకారంతో నూతన నిర్మాణ పనులు చేపట్టారు. ఆదివారం ఆలయ స్లాబ్‌నిర్మాణం పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తేలుకుంట్ల జగన్ రెడ్డి, ఇటికాల వెంకట్ రెడ్డి, తుమ్మేటి వీరారెడ్డి, ఇటికాల హన్మంత్ రెడ్డి, ఇటికాల నారాయణ రెడ్డి, అర్చకులు సీతారాములు, తేలుకుంట్ల హరినాథ్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, ఇటికాల విజయమ్మ, గౌని జంగయ్య, యాదయ్య, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నిధులున్నా నిష్ప్రయోజనం

(5వ పేజీ తరువాయి)

కొత్తపల్లి గ్రామస్తులు తక్కళ్లపల్లి గేటు మీదుగా మాల్ చేరుకుంటున్నారు. ఈ రహదారిపై రెండుచోట్ల సీసీ రోడ్డు కూడా వేయాల్సి ఉంది. కొత్తపల్లి నుంచి నాగిల్ల రహదారి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అయ్యవారిగూడ నుంచి నజ్దిక్‌సింగారం గ్రామాల మధ్య కిలోమీటర్‌న్నర మేర మట్టి రోడ్డు పూర్తిగా పాడైపోయింది. నల్లవెల్లి నుంచి మంతన్‌గౌరెల్లి వరకు బీటీ రోడ్డు వేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఇరుగ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల మళ్లింపు?

గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రోడ్లకు మరమ్మతులు చేయడం ఇష్టం లేకనే కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా పనులు చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. పంచాయతీరాజ్ శాఖలో నిధులు లేకపోవడంతో పనులు చేయడం లేదనే విమర్శలూ ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన కోట్లాది రూపాయల నిధులు ఇతర శాఖలకు మళ్లించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ శశాంక కల్పించుకొని రోడ్ల మరమ్మతు పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

రోడ్డు ఇంకెప్పుడు పూర్తి చేస్తారు



కొత్తపల్లి మాల్ గ్రామాల మధ్య చాలాకాలంగా రోడ్డు మరమ్మతు పనులు ఆగిపోయాయి. ఏడాది కావస్తున్నా ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. రోడ్డు బాగాలేకపోవడంతో 9కిలోమీటర్లు చుట్టూ తిరిగి మాల్‌కు చేరుకుంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఆగిపోయిన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి

- విప్లవ్‌కుమార్, కొత్తపల్లి